సాక్షి కామారెడ్డి

ఆదివారం । 8 డిసెంబర్ । 2024



క్రమబద్ధీకరించాలి

తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి.

- 8లో ▸



క్రీడలతో స్నేహభావం

సీఎం కప్ గ్రామస్థాయి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

36.3 /20.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



కామారెడ్డి అర్బన్: జిల్లా న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ శనివారం పట్టణంలోని శ్రీత్రిశక్తి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీధర్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ వికాస పరిషత్ అధ్యక్షుడు చేపూరి అర్జున్‌రావు పాల్గొన్నారు.

'సమస్యలుంటే ఫిర్యాదు చేయండి'



కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్‌లో సమస్య పరిష్కారం కాకపోయినా, పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోయినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సింధు శర్మ ఓ ప్రకటనలో సూచించారు. పీఎస్‌లకు వచ్చే ప్రజలతో పోలీసులు మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను సామరస్యంగా వినాలని ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ఉన్నతాధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. పోలీసు అధికారుల ఫోన్ నంబర్లను ప్రదర్శించే బ్యానర్‌లు, బోర్డులను అన్ని పీఎస్‌లలో ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరగకపోతే సీఐ కార్యాలయంలో, అక్కడా పట్టించుకోకపోతే డీఎస్పీకి ఫోన్ చేయాలని పేర్కొన్నారు. అయినా ఫలితం లేకపోతే జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 87126 86142 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్: అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. శనివారం నాటికి 80,551 టన్నుల చెరుకు క్రషింగ్ జరిగిందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.



కౌలాస్‌కోటలోని పెద్ద ఫిరంగిని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ సంగ్వాన్

ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ దృష్టి

- పేద విద్యార్థులకు వరం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- నిజాంసాగర్, పోచారం, కౌలాస్ కోటలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- జిల్లాలో సుడిగాలి పర్యటన



మద్నూర్ ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి, ఎంపీ షెట్కార్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/నిజాంసాగర్/మద్నూర్: అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లాలో పర్యటించారు. మద్నూర్ మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట సమీపంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక గురు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇది పేద విద్యార్థులకు వరంలాంటిదన్నారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కృషితో జిల్లాలో మొదటగా జుక్కల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరయ్యిందన్నారు.

ఏఎంసీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య, వైస్ చైర్మన్‌గా పరమేష్, కమిటీ డైరెక్టర్లతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. రైతులకు సేవ చేయాలని సూచించారు.



మద్నూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి, ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ సంగ్వాన్



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి

వందేళ్లైనా చెక్కు చెదరని కట్టడాలు

వందేళ్ల చరిత్ర కలిగిన, రాష్ట్రంలోనే మొట్టమొదటి కట్టడం అయిన నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు కౌలాస్ కోటను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్ కోటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసి, ఈ శాసనసభ సమావేశాల్లో నూతన టూరిజం పాలసీ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటక ప్రాంత అభివృద్ధికి 12 ఎకరాల స్థలాన్ని పర్యాటక శాఖకు కేటాయించామన్నారు. జనవరిలో టూరిజం పనులకు టెండర్లు పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. శతాబ్దం క్రితం కట్టిన నిజాంసాగర్ ప్రాజెక్టు, గోల్ బంగ్లా, ఛత్రిబంగ్లా, గుల్‌దస్తా ప్రాంతాలు పర్యాటకానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. అచ్చంపేటలోని చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం పునరుద్ధరణకు ప్రణాళికలు రూపొందించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటను సందర్శించారు. అక్కడి ఫిరంగులు, కట్టడాలను తిలకించారు. కౌలాస్ కోటను అభివృద్ధి చేయించి పూర్వ వైభవం తెస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జుక్కల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, అడ్వకేట్ రాంరెడ్డి, ఆకాష్, బాల్‌సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్ణాల స్ఫూర్తిని చాటేలా..

రాచరికపు ఆనవాళ్లు లేకుండా సబ్బండ వర్ణాల స్ఫూర్తిని చాటేలా కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీర్చిదిద్దారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైందని, రూ.7 లక్షల కోట్లు అప్పులు చేశారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కులమతాల మధ్య వైషమ్యాలు తొలగించడం తమ విధానమని, అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వర్గాలన్నింటికీ కలిపి ఒకేచోట సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలోనే పంటల బీమా పథకం తీసుకువస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

'పోచారం'ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆయన ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోటులో ప్రాజెక్టులో షికారు చేశారు. ప్రాజెక్టు మధ్యలోని ఐలాండ్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు చరిత్రను గురించి నీటిపారుదలశాఖ అధికారులు మంత్రికి వివరించారు. ఐలాండ్‌లో కాటేజీ నిర్మాణాలను చేపట్టి బోటింగ్ ఏర్పాట్లు చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రికి వివరించారు.

రూ.2.50 కోట్లు కేటాయింపు..

పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు వద్ద అతిథి గృహం, ప్రాజెక్టు మధ్యలో ఉన్న ఐలాండ్‌లో ప్రైవేట్ సంస్థ సహకారంతో రెస్టారెంట్ నిర్మిస్తామని పేర్కొన్నారు. నాలుగు బోట్లను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఎస్‌ఈ విద్యావతి, ఈఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకరచారి, నాయకులు శ్రీధర్‌గౌడ్, గంగారెడ్డి, రాంచందర్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కిష్టయ్య, ఇమామ్, లక్ష్మణ్, గులాం పాల్గొన్నారు.



బోటింగ్ చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

విశ్వాన్ని పరుగెత్తించే శక్తి సైన్స్‌కే ఉంది

- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ముగిసిన ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : విశ్వాన్ని పరుగెత్తించే శక్తి సైన్స్‌కు మాత్రమే ఉందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పోచారం మాట్లాడుతూ సైన్స్‌ఫెయిర్‌కు 560 ప్రాజెక్టులు వచ్చాయంటే దాని వెనుక సైన్స్ ఉపాధ్యాయుల కృషి ఎంత ఉందో అర్థమవుతోందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి తాను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ కలిసి పూర్తి సహకారం అందిస్తామన్నారు. బాన్సువాడలో తూర్పు, పడమరగా ఉన్న తామిద్దరం ఒక్కటయ్యామని, తెలంగాణలోనే బాన్సువాడను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

బాన్సువాడ ప్రాంతంలో ఇప్పటికీ బాల్య వివాహాలు చేస్తున్నారని, చిన్న వయసులోనే పిల్లలకు వివాహం చేసి భారం దించుకుందామని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారని సబ్‌కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. ఇంత అభివృద్ధి చెందినా చీకటి పడిందంటే ఆడపిల్లలను బయటకు పంపడం లేదన్నారు. బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సైన్స్‌ఫెయిర్లో ఉత్తమ ప్రదర్శనలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. జిల్లా నుంచి 8 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, డీఈవో రాజు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కుషాల్, సంతోష్, అరుణ్, సంతోష్, శ్రీనివాస్, బాల్‌రాజ్, ప్రవీణ్, హన్మండ్లు, నాగభూషణం, నరహరి తదితరులు పాల్గొన్నారు.



కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

చాయ్‌వాలా ఇంట చదువుల పంట!

సండే స్పెషల్

తల్లిదండ్రులకు పిల్లలే లోకం. వారి ఉన్నతికోసం నిరంతరం శ్రమిస్తారు. తమ కష్టం పిల్లలు పడకూడదన్న ఉద్దేశంతో.. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడానికి ఎంతటి కష్టాన్నైనా భరిస్తారు. కన్నవారి కలలను నిజం చేస్తూ కొందరు విజయాలు సాధిస్తారు. జిల్లాలో పలువురు చాయ్ విక్రయించి కుటుంబాలను పోషిస్తూ.. పిల్లలను ప్రయోజకులను చేశారు. వారి విజయగాథలపై సండే స్పెషల్..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- టీ అమ్ముతూ సంతానాన్ని తీర్చిదిద్దిన తల్లిదండ్రులు
- ప్రయోజకులై కన్నవారి కలలను నెరవేర్చిన పిల్లలు



ముగ్గురూ ఉన్నత స్థానాల్లో..



భార్య, పిల్లలతో పున్నంసింగ్



పున్నంసింగ్

సిరికొండ మండలం పాకాల తండాకు చెందిన పున్నం సింగ్ ఇంటర్ చదివాడు. బతుకుదెరువుకోసం పాతికేళ్ల క్రితం సొంతూరును వదిలి కామారెడ్డికి వచ్చాడు. పెట్రోల్ బంక్‌లో, సినిమా టాకీస్‌లో, ఓ కార్యాలయంలో పనిచేశాడు. ఆయన భార్య కళావతి ప్రైవేటు బడి టీచర్‌గా పని చేసింది. వాళ్లకు ముగ్గురు కుమారులు. వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలనుకున్న పున్నంసింగ్.. అక్కడా ఇక్కడా పనిచేయడం మానేసి.. ఇంట్లో చాయ్ తయారు చేసుకుని ఫ్లాస్క్‌లో పోసుకుని దుకాణాలు, కార్యాలయాలకు వెళ్లి విక్రయించడం ప్రారంభించాడు. చాయ్ అమ్మగా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూనే పిల్లలను చదివించాడు. పెద్దకుమారుడు కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్, రాయ్‌పూర్ ఎన్ఐటీ నుంచి ఎంటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం నిజామాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు కరుణ్‌కుమార్ బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేశాక, ఇండోర్ ఐఐఎం నుంచి ఎంబీఏ చదివాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మూడో కుమారుడు కల్యాణ్‌కుమార్ ఖరగ్‌పూర్ ఐఐటీలో చదువుకుని, లక్నోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ముగ్గురు కుమారులు ఉన్నత స్థానాలకు చేరినందుకు ఆనందంగా ఉందని పున్నంసింగ్ చెబుతున్నాడు. ఆయన ఈ మధ్యే చాయ్ అమ్మడం మానేశాడు.

పాతికేళ్ల కష్టానికి ఫలితం..



భార్య, కుమారులతో సిద్ధరాములు



గూడ సిద్ధరాములు

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గూడ సిద్దిరాములు పాతికేళ్లుగా చాయ్ అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. చాయ్ అమ్ముతూ పిల్లల్ని చదివించాడు. పెద్ద కుమారుడు శివప్రసాద్ బీటెక్ పూర్తి చేసి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సిద్దేశ్వర్ డిగ్రీ చదివి మార్కెటింగ్ రంగంలో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు శిరీషను కూడా చదివించి పెళ్లి చేశాడు. చాయ్ హోటల్ తనకు బతుకునిచ్చిందని చెబుతాడు సిద్దిరాములు. పిల్లలు ఎవరి పనుల్లో వారు స్థిరపడినా, ఆయన మాత్రం ఇప్పటికీ టీ స్టాల్ నిర్వహిస్తున్నారు.

పిల్లలను ప్రయోజకులను చేసి..

బీబీపేట మండల కేంద్రానికి చెందిన రత్నగారి లక్ష్మి, సిద్దాగౌడ్ దంపతులు గ్రామంలో పాతికేళ్లుగా టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి బాలకృష్ణాగౌడ్, పరశురాంగౌడ్, నాగరాణి సంతానం. ముగ్గురినీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివించాడు. పెద్ద కుమారుడు బాలకృష్ణాగౌడ్ ఉన్నత విద్యాభ్యాసం చేసి పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి భిక్కనూరు మండలం గుర్జకుంటలో పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు పరశురాంగౌడ్ చార్టెడ్ అకౌంటెంట్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తూ, సొంత కంపెనీ కూడా నిర్వహిస్తున్నాడు. ఎంబీఏ పూర్తి చేసిన కూతురు నాగరాణి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉంది. సంతానం ప్రయోజకులు కావడంతో సిద్దాగౌడ్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



సిద్దాగౌడ్



భార్య, కుమారులతో సిద్దాగౌడ్

క్లుప్తంగా

గోడప్రతుల ఆవిష్కరణ

రాజంపేట: ఓపెన్ స్కూల్ స్పెషల్ అడ్మిషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం మండలంలోని ఆర్గోండ పాఠశాల ఆవరణలో ఎంఈవో పూర్ణచందర్‌రావ్ చేతుల ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన కల్పించారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తుల రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



భిక్కనూర్ : రాష్ట్ర స్థాయి అండర్–14 హాకీ క్రీడలో ఉత్తమ ప్రతిభకనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైన భిక్కనూరు మండల పరిధిలోని మహాత్మా జ్యోతీరావు పూలే బాలికల విద్యాలయం విద్యార్థిని అక్షితను ప్రిన్సిపాల్ మాధవి, ఏటీపీ ప్రమోదాదేవి అభినందించారు. మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్‌లో నిర్వహించనున్న నేషనల్ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనేందుకు అక్షిత శనివారం బయల్దేరి వెళ్లింది.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



బాన్సువాడ రూరల్: చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి టీఎస్‌పీ భార్గవి సూచించారు. శనివారం బాన్సువాడ కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. బాన్సువాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, పట్టణ సీఐ అశోక్, న్యాయవాదులు భూషణ్‌రెడ్డి, మొగులయ్య, ఖలీల్, ఆనంద్, లక్ష్మారెడ్డి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాల సాధనకు కృషి'



నాగిరెడ్డిపేట: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పేర్కొన్నారు. శనివారం ఆయన నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు మోడల్ కాలేజీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలకోసం 95 రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించామన్నారు. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు, పరీక్షలు, నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటైన నాగిరెడ్డిపేట, బీర్కూర్, బీబీపేట, నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సొంత భవనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించామన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు విష్ణు, కృష్ణయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాల శాస్త్రవేత్తలు భళా

- సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ
- 8 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక



ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు



రాకెట్ ప్రయోగ ప్రదర్శనలో తాడ్కోల్ విద్యార్థులు

బాన్సువాడ: విద్యార్థుల్లోని సృజనాత్మకత, ఆలోచనాశక్తి వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో బాన్సువాడలో జిల్లా స్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలు నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా కామారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన 560 ప్రాజెక్టులను ప్రదర్శించగా 8 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. కేతావత్ పవిత్ర(కొండాపూర్), అవుసుల శివకుమార్(బాన్సువాడ), విష్ణుప్రియ (మాచారెడ్డి), శివరాంశెట్టి(కామారెడ్డి), గుగులోత్ రాహుల్ (కోనాపూర్), పవర్ సంజన(బిచ్కుంద), అంజలి(చిన్న కొడప్‌గల్), ఆకాశ్(అచ్చంపేట్) తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి విద్యార్థులను అభినందించారు.

కళ్లు మూసుకుంటే అలారం మోగుతుంది..



నేను తయారు చేసిన అద్దాలు డ్రైవర్లను అప్రమత్తం చేస్తాయి. వాహనాలు నడిపేటప్పుడు నిద్రవస్తే ఈ అద్దాలు పెట్టుకుంటే అలారం మోగుతుంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండవు. సైన్స్ ఉపాధ్యాయులు చెప్పిన పరిజ్ఞానంతో ఇలా ప్రదర్శన చేయడం సాధ్యపడింది.

– విష్ణుప్రియ, జెడ్పీహెచ్ఎస్, మాచారెడ్డి

ప్రకృతి వైపరీత్యాలు ఎదురయ్యేముందు..



ప్రకృతి వైపరీత్యాలు ఎదురయ్యేముందు మేము తయారు చేసిన పరికరం ముందుగానే పసిగడుతుంది. అంతేకాకుండా పలు జాగ్రత్తలు సూచిస్తుంది. నష్టం జరగకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించవచ్చు. వాతవారణంలో మార్పులు చోటు చేసుకున్న క్రమంలో తాము తయారు చేసిన ప్రదర్శన ముందే పసిగట్టి సహాయపడుతుంది.

– ప్రవళిక, పూజిత, సింధు విద్యాలయం, బాన్సువాడ

చారిత్రక కట్టడాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం



లింగంపేట మెట్లబావిని పరిశీలిస్తున్న మంత్రి

- పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



మహిళా సంఘాలు తయారు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి

లింగంపేట: చారిత్ర కట్టడాలకు పూర్వ వైభవం తేవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కృష్ణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని సందర్శించారు. ముందుగా మహిళా సంఘాలు తయారు చేసి ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. మహిళలతో గిరిజన సంప్రదాయ దుస్తులు తయారు చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కుటీర పరిశ్రమలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ గ్రామంలో అంతర్భాగంలో ఐదు అంతస్తుల మెట్ల బావి ఉండడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఆర్డీవో ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీలత, డీఆర్డీవో సురేందర్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేశ్, ఏపీఎం శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల స్పెషల్ డ్రైవ్



మోర్తాడ్(బాల్కొండ): వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నా ఒక్కో కనెక్షన్‌కు ప్రతి నెలా రూ.30 చొప్పున ఏడాదికి రూ.360 వసూలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. సర్ చార్జీలను ప్రతి ఏడాదిలో డిసెంబర్‌లో వసూలు చేస్తారు. ఈ ఏడాది సర్ చార్జి వసూలు కోసం విద్యుత్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రైతుల చెంతకే వెళ్లి ఒక్కో కనెక్షన్‌కు సర్‌చార్జీని వసూలు చేసి రసీదు అందిస్తున్నారు. జిల్లాలో 1.75లక్షల విద్యుత్ కనెక్షన్‌లు ఉండగా వీటి సర్‌చార్జీలను పూర్తి స్థాయిలో ఈనెలాఖరులోగా వసూలు చేయాల్సి ఉంది. సర్‌చార్జీలతో ఎన్‌పీడీసీఎల్‌కు రూ.6.30 కోట్ల ఆదాయం లభించనుంది. సర్‌చార్జీల వసూళ్ల కోసం రోజుకో గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని భీమ్‌గల్, మోర్తాడ్ సబ్ డివిజన్‌ల ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. రైతులు సహకరించి సర్ చార్జీలను చెల్లించాలని ఆయన కోరారు.

బస్సు వచ్చేదెప్పుడో?



బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట: ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి 7 గంటల వరకు బస్సు రాలేదు. దీంతో విద్యార్థులు చీకటిలో బస్సు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి – గోపాల్‌పేట రూట్‌లో బాన్సువాడ డిపోనకు చెందిన బస్సు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తుంది. మండలంలోని తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ బస్సులో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు వచ్చి వెళ్తుంటారు. శనివారం రాత్రి 7 గంటల వరకు కూడా బస్సు రాలేదు. దీంతో విద్యార్థులు మోడల్ స్కూల్ వద్ద ప్రధాన రహదారిపై చీకట్లో నిరీక్షించాల్సి వచ్చింది. కొన్నాళ్లుగా బస్సు సమయానికి రావడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. సకాలంలో బస్సు నడిచేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ విడుదల



సుభాష్‌నగర్: జిల్లాలోని 27 మండలాల్లో పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ శనివారం ఆయా మండలాల కేంద్రాల్లో ఎంపీడీవోలు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాలు, 545 గ్రామపంచాయతీలు, 5,022 వార్డు స్థానాలు, 5053 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్లపై 10న జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, 12న మండల స్థాయిలో సమావేశం ఉంటుందని ఇన్‌చార్జి డీపీవో శివకృష్ణ తెలిపారు. 13న పోలింగ్ స్టేషన్‌లపై అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్: తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్షలు శనివారం రెండో రోజు చేరాయి. ఈ సందర్భంగా సంఘం సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని, తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల నుంచి నిరవధిక సమ్మె చేపడతామన్నారు. దీక్షలో ఉద్యోగులు రాములు, సాయిలు, శైలజ, సంధ్య, సంతోష్ రెడ్డి, గంగాప్రసాద్, మాధవి, అజీజ్, కాళిదాసు, కృష్ణంరాజు, రాజు, లింగం, నందు, దినేష్, విజయ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల మద్దతు

దీక్షలను సందర్శించిన ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ ప్రొగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ అనిల్‌కుమార్, కొంగల వెంకటి మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న 19600 కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంగయ్య, బాబయ్య దీక్షలకు సంఘీభావం తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలోని షష్ఠి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్, సుగుణాకర్, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.



తెలిపారు. 108 నది జలాలతో స్వామి వారికి అభిషేకం ఉంటుందని, ఉత్సవాలకు రంగంపేట పీఠాదీశులు మాధవానంద సరస్వతి స్వామి హాజరవుతారని అన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు గంగారాం, రాజాగౌడ్, సిద్ధారెడ్డి, రాంచంద్రం, సదా శివుడు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూడెల్లి రామలింగేశ్వరాలయంలో..



భిక్కనూరు: మెదక్ జిల్లా కూడెల్లిలోని రామలింగేశ్వరాలయాన్ని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శనివారం సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాలి రెడ్డి, నేతలు నర్సింహరెడ్డి, అంకంరాజు, ఉరుదొండ నరేశ్ ఉన్నారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు

నిజాంసాగర్: మండలంలోని బ్రాహ్మణపల్లి ఏకశిల అభయ ఆంజనేయస్వామి ఆలయం సప్తమ వార్షికోత్సవానికి ముస్తాబైంది.ఆదివా రం అభయ ఆంజనేయస్వామికి అభిషేకం, హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కర్త కిశోర్‌కుమార్ తెలిపారు.

ప్రారంభమైన అయ్యప్పస్వామి ఆలయ ఉత్సవాలు



దోమకొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఆలయ 11వ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి పూజ చేశారు. పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మహాపడిపూజ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నర్సారెడ్డి, రామస్వామిగౌడ్, మోహన్‌రెడ్డి, కంది వినోద్, మనోజ్‌కుమార్, రాజేశ్వర్, శ్రీనివాస్, బాల్‌రాజ్, సీడీపీ మాజీ ఎంపీపీ శారద, మాజీ సర్పంచ్ అంజలి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో అన్నదానం

మద్నూర్: మద్నూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. సాయి దుర్గా గ్రూపు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



మద్నూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మద్నూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి సామూహిక మహా మండల పడి పూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమశాఖకు అవార్డు



నిజామాబాద్ నాగారం: గతేడాది సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా అత్యధికంగా విరాళాలు సేకరించినందుకు జిల్లా అధికారి రమేశ్, ఉద్యోగులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా శనివారం అవార్డును శనివారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని గవర్నర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గంగామోహన్, ఉమేర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురి ఆత్మహత్య

కుటుంబ కలహాలతో ..



మీనా మృతదేహం

పిట్లం(జుక్కల్): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కంబాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఎర్ర మీనా(25)కు శుక్రవారం రాత్రి భర్తతో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన మీనా శనివారం ఉదయం 11గంటలకు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక..

ఎల్లారెడ్డి: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వెల్లుట్లలో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన యామ గంగారాం (46) కూతురి వివాహం చేయడంతోపాటు కొంత స్థలాన్ని కొన్నాడు. ఈ నేపథ్యంలో అప్పులై ఆ బాధ తాళలేక శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




గంగారాం(ఫైల్)

రైలు కిందపడి..

రాజంపేట: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. తలమడ్ల గ్రామ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం ఉందని రైల్వే ఉద్యోగులు స్టేషన్ మాస్టర్‌కు తెలుపగా, ఆయన రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతుడిని మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన సుల్గొండ శ్రీనివాస్ (45)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గ్రానైట్ లారీ బోల్తా



ఎల్లారెడ్డిరూరల్: గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఎల్లారెడ్డి పట్టణ శివారులో శనివారం బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. హైదరాబాద్ నుంచి రాజస్థాన్‌కు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడిందని, ప్రమాదంలో ఎవరికీ గాయాలుకాలేదన్నారు.

చెరుకు లారీ..



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌రామ్‌పల్లి చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి చెరుకు లారీ బోల్తా పడింది. సంగారెడ్డి జిల్లా నుంచి మాగి గాయత్రి చెరుకు ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ ప్రధాన రహదారిపై బోల్తా పడింది. రోడ్డుపైన చెరుకు కుప్పకూలడంతోపాటు లారీ టైర్లు ఊడిపోయాయి. ప్రమాదంలో లారీడ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

సెల్ ఫోన్‌ల అప్పగింత



ఫోన్‌లను అప్పగిస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి టౌన్: దేవునిపల్లి పీఎస్ పరిధిలో గత మూడు నెలల కాలంలో చోరీకి గురైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఎస్సై రాజు శనివారం ఎనిమిది మందికి అప్పగించారు. సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌లు రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. శీనివాస్, క్రాంతి, కిరణ్‌గౌడ్, శంకర్, సాయిలు, సుధాకర్, గుల్మార్, కనకయ్య, ప్రమోద్‌లకు ఫోన్‌లను అప్పగించామన్నారు.

భూవివాదంలో పరస్పర దాడులు

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన దాయాదులు కొట్టె కోటేశ్వర్, కొట్టె పోతన్నలు భూతగాదాలో శనివారం పరస్పర దాడులకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాళేశ్వర్–తుంగిని గ్రామాల శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ పరిధిలో తాతలకు చెందిన భూమిని కొన్ని దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, కోటేశ్వర్, పోతన్న ఎలాంటి పట్టా లేకుండానే ఆ భూమి కోసం కొన్నేళ్లుగా ఘర్షణ పడుతున్నారు. శనివారం ఇరువర్గాలకు చెందిన వారు పరస్పర దాడులు చేసుకున్నారు. కొందరికి గాయాలుకాగా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవి జంతువును చంపిన వ్యక్తి అరెస్టు



నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం శివారులో ముళ్లపందిని వేటాడి చంపిన శేఖర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్ ఆర్ వో సంజయ్‌కుమార్ తెలిపారు. శేఖర్ గుండారం శివారులో ముళ్లపందిని వేటాడి దానిని కాల్చి శుభ్రం చేస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఘటనాస్థలానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని ఇద్దరి పూచీకత్తు తీసుకుని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిలో సైబర్ మోసం

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఉప్పరి పండరి సైబర్ మోసానికి గురైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. పండరికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ధనీ ఫైనాన్స్ నుంచి మీకు రుణం మంజూరైందని, పొందేందుకు ఆన్‌లైన్ చార్జీలు రూ.42వేలు చెల్లించాలని సూచించడంతో పండరి డబ్బులు పంపాడు. ఆ తరువాత అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎస్టీ ఆర్ కాలనీలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాలనీలోని ఓ ఇంటిపై దాడి చేయగా 9.9 క్వింటాళ్ల పీడీ ఎస్ బియ్యం పట్టుబడిందని, బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్‌లో విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన బాణాల మహిపాల్ గేదెను రోజులాగే వ్యవసాయ బావి వద్ద షెడ్డులో కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లేసరికి సమీపంలో గేదె మృతి చెంది కనిపించింది. కట్టను ఊడదీసుకుని మేత మేసేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు మహిపాల్ తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నగేశ్, వైద్యాధికారిణి అనూష, పశుగణ సహాయకురాలు అహల్య సందర్శించారు.